# "అనుకొన్నట్టే అయింది"

రచన:
శ్రీనివాసపురం రామాచార్యులు

విజయవాడస్టేషనులో ఎక్కినప్పటినుంచీ రాజారావు తను కూర్చున్న సీటుకు రెండవ సీటులో కూర్చున్న అమ్మాయి, ఆమెను ప్రక్కనే కూర్చున్నాయనా ఎవరై వుంటారు అని ఆలోచిస్తున్నాడు. కానీ వాళ్లెవరైందీ ఎలా తెలుస్తుందీ? ఎందరో యెక్కుతారు, ఎందరో దిగుతారు. ఎవర్ని తనకు తెలుసు? ఎవర్నీ తెలియదు! అలాంటప్పుడు వాళ్ళను (ఆమెను) గురించి ఆలోచించడమెందుకు? అని తనని తనే ప్రశ్నించుకున్నాడు. ఆ ప్రశ్నకు సమాధానమేమీ చిక్కలేదతనికి: ఎంత ప్రయత్నించినా ఆలోచించకుండావుండలేకపోతూన్నాడు. అతనిబుర్రలో ఆలోచనాశకటాలా ధూమశకటంకంటే వేగంగా పరుగెడ్తున్నాయ్! హృదయాంతర్భాగంలో ఏదో తెలీని వేదనాగ్ని పొగలు రాజుకుంటోంది...కళవళపడుతోంది......మూగగా రోదిస్తోంది.

ఒక్కొక్కప్పుడు ఆమెను మాటాడించాలనుకుంటాడు కానీ, ఆ భావానికేదో అడ్డు తగులుతోంది. అందువల్ల మాటాడించలేక పోతున్నాడు. తనకు తెలీకుండానే ఆమె సౌందర్యానికి తను దాస్యం చేస్తున్నందుకు తిట్టుకున్నాడు. ఏమిటీ! తనకీ పిచ్చిఆలోచనలు. ఆమెవరు? తనెవరు? అందరానిదానికి ఆశిస్తున్నాడు తను. ఇలాంటి మనోదౌర్బల్యముందన్న విషయం తెలిసేసరికి అతనికి తన మీద ఎంతగానో కోపంవచ్చింది.

ఇంకా కొస్త అటుజరిగికూర్చున్నాడు. మదరాసుచేరుకునేసరికి దాదాపు సాయంకాలం 4 గంటలవచ్చు. అంతవరకూ కాలం వెళ్లబుచ్చటమెలా? అతనికేమీ పాలుపోలేదు. ఒక్కచూపులోనే తన మనస్సునాకర్షించిన ఆ అమ్మాయినుండి దృష్టులను నెమ్మదిగా ప్రశాంతంగా తన 'హ్యాండ్ బేగ్'పైకి సారించాడు. విజయవాడస్టేషనులో కొనుక్కున్న దినపత్రిక కనబడింది. ప్రయోజనంలేని విషయాలకోసం బాధపడ్డమెందుకని దాన్ని తీసుకుని చాలా సీరియస్‌గా చదివేస్తున్నాడు: ఇంతలో — "ఏమండీ!" అన్న కేక అతని చదువుకు అంతరాయం కల్గించింది. ఎవరా పిల్చిందని? అని నెమ్మదిగా అటు చూచాడు. "ఆమధ్య పేపరిలా యివ్వండి చూచిస్తా!" అంటున్నాడు ఆ అమ్మాయిప్రక్కన కూర్చున్నాయన.

తను పత్రిక చదువుతుండేప్పుడు "ఆమధ్య పేపరిలా యివ్వండి, ఆ చివరి పేపరిలా యివ్వండి" అనేవాళ్ళని చూస్తే తన్నాలని బుద్ధిపుడుతుంది రాజారావుకు కాని, ఇవాళదేమో అలా బుద్ధిపుట్టలేదు. సరికదా! యివ్వాలని బుద్ధిపుట్టింది. 'ఇదిగో! తీసుకోండి!' అంటూ మధ్యపేపరుతీసి అతివినయంగా ఆయన చేతికందిచ్చాడు.

* * *

రైలు పొగలు కక్కుకుంటూ అడవుల్లో, కొండల్లోదూరి వేగంగా పోతోంది. రాజారావు పేపరుచదివిచాలించాడు. ఆఅమ్మాయి ప్రక్కన కూర్చున్నాయనగూడా పేపరు మడుస్తూ రాజారావువైపు చూసి "తమరి ప్రయాణమెందాక?" అన్నాడు.

"సెంట్రల్ స్టేషన్ వరకూ" అని జవాబు చెప్పి "మరి మీరో?" అని ఎదురుప్రశ్న వేశాడు.

"ఆఁ!... మేమూ అంతేలెండి! సెంట్రల్ దాకానే" సాగదీస్తూ అన్నాడాయన.

"క్షమించండి! తమ పేరేమిటో అడుగవచ్చా?"

"పేరు అడగటంలో తప్పేముందని... నా పేరు రాజారావండి!"

"అయితే రాజారావుగారు! తమరేం చేస్తున్నారిప్పుడు"

"బి.ఏ., ఆనర్సు పూర్తిచేశాను. ప్రస్తుతం ఊరకనేవున్నా! ఇంకా యేమీ పైచెయ్యలేదు"

అంతవరకూ మాటాడకుండా వుండిన ఆ అమ్మాయి "నాన్నా! యీమధ్య స్టేషన్లలో యెక్కడా రైలాగదా?" అని రాజారావువైపు దొంగతనంగా చూస్తూ అంది. ఆమె పెదాలపై చిరునవ్వు నాట్యంచేసింది. పెదవులు విడిపోయి బుగ్గలు ప్రక్కలకెళ్ళాయి.

"ముందర స్టేషనులో ఆగుతుందమ్మా!" అన్నాడా అమ్మాయితండ్రి.

మొదటనుంచీ తననుకున్నట్టే అయింది: ఆ అమ్మాయితండ్రే ఆయన. ఆమె తనవైపుకే చూస్తూ నవ్వినవ్వులో ఏ భావాలిమిడి వున్నాయో? ఏ గూడార్థా లున్నాయో? వాటి విలువేమిటో? తనకర్థంకాలేదు. కానీ, ఆనవ్వు తననేస్వర్గసీమల్లోకో తీసికెళ్ళినట్టనిపించింది. ఆమె పేరేమిటో? తనకున్న భావాలే ఆమె హృదయంలోగూడ మెదుల్తున్నాయేమో? తనకిమల్లేనే యేమీ చెప్పలేక బాధపడుతోందేమో? ఆమెనిగురించి తనిందాకటివరకూ ఆలోచించినట్టు తన్నిగురించి గూడా ఆమె ఆలోచిస్తోందేమో? ఏదో అవ్యక్తపు సన్నిహితత్వం తనలోవుండి తనని ఆమెవేపుకి లాగుతోంది. ఆమెపై తనకెందుకీ అవ్యాజమైనప్రేమ అనుకుంటున్నాడు రాజారావు.

మరి కాస్సేపటికల్లా రైలు పెద్దగా కూతపెట్టి వేగాన్ని తగ్గించుకుంటూ వెళ్ళి ముందరిస్టేషన్‌లో ప్లాటుఫారంను సమీపించి ఆగింది. అంతవరకూ యెక్కడో ఆలోచనాసీమల్లో విహరిస్తున్న రాజారావు ఆకూతతో ఒక్కసారి అదిరిపడ్డట్టై తేరుకున్నాడు.

* * *

ఆ స్టేషనులో రాజారావుకు ప్రక్కన కూర్చున్నవాళ్ళు దిగిపోయ్యారు. ఇప్పుడు తనకూ ఆ అమ్మాయికీ మధ్య యెవ్వరూ లేరు! రాజారావు బెదురుగానే ఖాళీఅయిన సీటులోకి జరిగికూర్చున్నాడు.

“శ్యామలా ఇక్కడే కూర్చోవుండమ్మా! ఐదు నిమిషాల్లో వచ్చేస్తా” అని రాజారావు వైపు చూస్తూ—“ఏమండీ! రాజారావుగారు హోటలుకు వెళ్దాం వస్తారా?” అన్నాడామె తండ్రి.

“మీ కోరిక నిరాకరిస్తున్నందుకు క్షమించండి! ప్రస్తుతం నాకేమీ ఆకలవటంలేదు. మీరు వెళ్ళిరండి” అన్నాడు రాజారావు.

“ఆ టిఫిన్ కారియరిలా యివ్వమ్మా! నీకు భోజనం పట్టుకొస్తాను” అన్నాడాయన.

“నాకేమీ అక్కర్లేదు నాన్నా! మీరు వెళ్లిరండి” అంది శ్యామల. ‘సరేలే’ అంటూ ఆయన దిగి హోటలుకు వెళ్ళాడు.

రాజారావు యెంత సేపట్నుంచో ఆ అమ్మాయిపేరు తెల్సుకోవాలని తాపత్రయ పడ్డాడు. ఇపుడు వాళ్ల నాన్న మాటలవల్ల తెలిసింది పేరు “శ్యామల” అని—ఎంత చక్కటి పేరు. పేరుకు తగ్గట్టే శ్యామల వర్ణంగావున్న కోమలశరీరం — వీణాస్వరం లాగావున్న కంఠం పొంగారుతోన్న యావ్వనపుఛాయలు, ఆమెకళ్ళల్లో(వున్న) కనబడే కాంతి, నవ్వినప్పుడు సొట్టలుపడే బుగ్గలు, తుమ్మెదలు ముసురుతోన్నట్టు పిల్లగాలికి ముఖంపై అటు నిటు నృత్యంచేస్తోన్న ఉంగరాలుతిరిగిన జుత్తు, పదహారేళ్లలోవు వయసు అన్నీ సృష్టిలోవున్న సౌందర్యాన్నంతా ఒకటిగాచేర్చి విధాత యీ శ్యామలను సృష్టించాడేమో? అనిపిస్తుంది,

శ్యామలతో మాటాడాలని కాయశక్తులా ప్రయత్నించాడు రాజారావు. కారణం లేందే ఎలా మాట్లాడ్డం? లేకపోతే ఎలాగో మాటాడొచ్చు! కానీ తనలోవున్న అశక్తత అడ్డువస్తోంది. తనలో ఎందుకింత బలహీనత వుందో తనకే అర్థంకావడంలేదు రాజారావుకు. ప్రశాంతంగా శ్యామల ముఖంలో కొకసారి చూచి తర్వాత శ్యామలతండ్రికి తనిచ్చిన పేపరు ఆమె ప్రక్కనవుంటే దాని కేపొకసారి చూచాడు.

రాజారావు చూపులోని అర్థం గ్రహించిన శ్యామల ఆ పేపరు చేతుల్లోకి తీస్తూ “మానాన్న మిమ్మల్ని పేపరు పూర్తిగా చూడనివ్వలేపోయారు; ఇందాండి! పూర్తిగా చదవండి” అంటూ అందిచ్చింది.

శ్యామల తనతో యెంత బాగా మాటాడింది. ఆమాత్రం తను మాట్లాడలేకపోయాడు. ఛీ ఛీ! ఆడవాళ్ళకంటే అసమర్థుడయాడా? తను. ఏమిటీ తఃకీ భయం! ఈసారి ఎలాగైనా శ్యామలతో మాటాడెయ్యాలి! అనుకున్నాడు. అనుకున్నవాడు అట్టే కాలం గడువకుండానే ధైర్యంగా అడిగేశాడు: “శ్యామలా! మీనాన్న పేరేమి?”

“సుందర్రావు” అంది శ్యామల. ఆమె పెదవులు మెల్లగా నిర్లిప్తగా కదిలేయి.



“కనీసం నువ్వు ఇంటరైనా పూర్తిచేసుంటావనుకుంటాను” ఇది రాజారావు రెండవ ప్రశ్న. తను ప్రశ్నలు సరిగా వెయ్యటం లేదని తనకే తెలుస్తోంది. కానీ ... ఎలాగైనా శ్యామలతో మాట్టాడాలనివుంది తనకు. అంచేత ఒకదానికీ ఇంకోదానికీ సంబంధం లేకపోయినా అడిగేస్తున్నాడు.

“మీరన్నట్లు సరిగా ఇంటరే పూర్తి జేశాను. ఆ తర్వాత మానాన్న నిలపేశారు. నా చదువునుగూర్చి మీకెలా తెలిసింది? కచ్చితంగా చెప్పారే!” అంది శ్యామల. పైన తిరుగుతోన్న ఫేన్ల గాలికి ప్రక్కకు తొలగుతోన్న పమిట సర్దుకుంటూ.

“నాకు తెలవడమేమిటి? కేవలం అది నా ఐడియామాత్రమే!” చిన్నగా నవ్వుతూ అన్నాడు రాజారావు.

మరో నిమిషంవరకూ యెవరూ యేమీ మాట్లాడలేదు. రాజారావుకిక ప్రశ్నించటానికేమీ తోచలా! “బుక్‌స్టాల్‌కన్నా వెళ్ళి యేదైనా మాగ్‌జైను కొనుక్కొస్తే బావుణ్ణు” అన్నాడు.

“నావద్ద ‘చిత్రగుప్త’ వుంది చదువుతారా?” అంటూ శ్యామల ‘హేండ్‌బ్యాగ్’లోంచీ పత్రికతీసి రాజారావు చేతికిచ్చింది.

రాజారావు తీసుకుని చూచి: “ఇదా? దీన్ని నేను చదివేశాను. దీన్లో ‘నశించిన మానవత్వం’ అన్న కథ చాలా బావుంది. రచయిత బాగా చిత్రించాడు కథను: నేనూ నాలుగేళ్ళనుంచీ కథలు రాస్తున్నాను. చాలా కథలు ప్రచురించబడ్డాయి కూడా! కథలు రాయడం నాకు చాలా యిష్టం” అన్నాడు.

“కొందరు రచయితలు కళ్ళకి కట్టినట్టు చాలా బాగా చిత్రిస్తారు కథల్ని. కొన్ని కథలు, కథావస్తువులు సరిగాలేక చప్పచప్పగా వుంటాయి” అంది శ్యామల సాహిత్యపిపాస తనకూ వుందన్నట్లుగా.

హోటలుకెళ్ళిన సుందర్రావువచ్చి కూర్చున్నాడు. మరో నిమిషానికంతా రైల్లుగా ఓ

కూతపెట్టి పొలాల్లోంచి దారిచేసుకుంటూ వీరుడిలాగా బయల్దేరింది రైలు.

*        *        *

సూర్యుడు వాలిపోతున్నాడు. తూర్పు దిక్కునుంచీ పెద్దపెద్ద మేఘాలు గుంపులు గుంపులుగా ప్రయాణిస్తున్నాయ్! పశ్చిమాద్రికి. రైలు వేగంగా వెళ్తోవుంది. వాళ్ల ముగ్గురిమధ్యా కాలం నిశ్శబ్దంగా గడచిపోతోంది. ఆనిశ్శబ్దవాతావరణాన్ని సహించలేక సుందర్రావందుకున్నాడు:

“ఏమండీ! రాజారావుగారూ! ఏమిటో ఆలోచిస్తోన్నట్టున్నారు?”

“ఎబ్బే! ఏమీ లేదండీ! ఉత్తనే మీకలా అవుపిస్తున్నానేమో!” అన్నాడు రాజారావు. పైకలా అన్నాడుగాని; నిజానికి శ్యామలతో ఇంకా కాస్సేపు మాటాడివుంటే బావుణ్ణే! అని ఆలోచిస్తోనేవున్నాడు.

“మానవులు పరిస్థితుల చేతుల్లో కీలుబొమ్మలు: కానీ మానవులచేతుల్లో పరిస్థితులు కీలుబొమ్మలుకాదు! కాలం మానవుణ్ణి నడిపిస్తుంది; కానీ కాలాన్ని మానవుడు నడిపించటంలేదు. తప్పుచెయ్యకండా మానవులు బ్రతుకలేరు. ఈ సమాజంలో తప్పుచెయ్యనివారంటూవుండరు. అలాగని తప్పులుచెయ్యమనికాదు నా ఉద్దేశం! నేనిదంతా ఎందుకు చెబుతోన్నానో సాంతంగావింటే మీకే అర్ధమౌతుంది. మొన్నీమధ్య ఏం జరిగిందంటే! మా ప్రక్కింటాయన ఆఫీసునించీ యింటికి వొచ్చేసరికి ఆయనభార్య; ఆమె కాలేజీలో చదువుతోన్నప్పటి తనస్నేహితునితో మాట్లాడుతూ వుందట. ఆ దృశ్యంచూచి ఆయనకు వొళ్ళు మండిపోయింది. ఆ వచ్చినాయన అటుపోగానే పెళ్ళాన్ని చావచితక్కొట్టి, నానా రభసజేసి అప్పుడే పుట్టింటికి పంపేశాడు. ఆమె ఉసూరుమంటూ వెళ్లిపోయింది. చూడండి! అదేమంత క్షమించరాని తప్పా? ఏమో స్నేహితుడుగదాని నాలుగు కుశల ప్రశ్నలేసివుండవచ్చు! ఆమాత్రంధానికే అంత రభస చేయాలా? ‘ఆరోజులు కావిప్పుడు అంతా వొట్టిపోకిరీవెధవలు. ఇలాంటివారితో విచ్చలవిడిగా మాట్లాడకు జాగ్రత్త! తెలిసిందా?’ అని కొస్త గట్టిగా చెప్పివుంటే సరిపోదాండీ! అర్ధంలేని ఆలోచనలు చేసుకుని పండంటి సంసారాన్ని పాడుజేసుకున్నాడు. అలా చెయ్యొచ్చాండీ?” అని ముగించాడు సుందర్రావు.

“ఔను! నిజమే! అదొకతప్పుగా భావించలా చెయ్యకూడదు” అన్నాడు రాజారావు. అన్నాడేగాని...ఒకవేళ తనకే పెళ్ళి అయివుండి తనులేనప్పుడు తనభార్య పరాయి మగవాడితో మాట్లాడుతోంటే చూచి తను మాత్రం క్షమించగలడా? క్షమించలేడు! అయితే తనుగూడా హృదయంలేనివాడే! అనుకున్నాడు మళ్ళీ.

ఇదంతా వింటూ మధ్యమధ్య అప్పుడప్పుడూ రాజారావువైపు క్రీగంటచూస్తో ఊరకనేవుంది శ్యామల.

రాజారావు మరొక్కసారి శ్యామలకళ్ళల్లోకి చూచి తలొంచుకున్నాడు.

సాయంత్రం దాదాపు నాలుగు గంటలకు పైగా అయింది. రైలు వేగాన్ని తగ్గించుకుంటూవెళ్ళి సెంట్రల్లో నిలిచింది. శ్యామల ఆమెతండ్రి దిగారు ఆ తర్వాత రాజారావు కూడా దిగాడు. “ఇహ వస్తామండీ రాజారావుగారూ!” అని చెప్పి వాళ్ళు వెళ్ళిపోయ్యారు. శ్యామలమాత్రం పోతూపోతూ రాజారావు వైపొకసారి చూచింది, రాజారావుగూడా శ్యామల వైపొకసారి చూచి బరువుగా వెళ్ళిపోయాడు.

*        *        *

రాజారావు మదరాసు వెళ్ళివచ్చి అప్పుడే ఒక నెలయింది. ఓరోజు రాజారావుతండ్రి రాఘవరావు అతణ్ణి పిలిచి “ఏమోయ్! కొద్దిరోజుల్నుంచీ నీ ధోరణి అదోలావుంది. నీకు పిల్లనిస్తామంటూ ఎందరో తమకు తాము ముందుకొస్తున్నారు: అన్నివిధాలా అనుకూలముగావున్న సంబంధం ఒకటుంది, అయినా పిల్లని నీవూ ఓసారి చూడాలిగా; ఎల్లుండి వెళదాం! ఏం?” అన్నాడు. రాజారావుకు తన్నెవరో నిలువుదోపిడీ చేసినట్లనిపించింది. అతనికి నోటమాట పెగల్లేదు. చివరికి అతి ప్రయత్నంమీద “మీ యిష్టం నాన్నా!” అని మాత్రం అనగలిగాడు.

భోజనాలయ్యాయి “ఇక ప్రయాణం కట్టరా!” అన్నాడు రాఘవరావు.

రాజారావుకు మనస్సులో వ్యధగానే వుంది. తండ్రిమాటకడ్డుచెప్పలేక “సిద్ధంగా వున్నా”నన్నాడు.

తర్వాత యిద్దరూ బయల్దేరారు. త్రోవపొడుగూ రాజారావుకు శ్యామల్నిగురించిన ఆలోచన్లే వస్తున్నాయి. మదరాసు చేరుకునేసరికి సాయంత్రం నాలుగ్గంటలైంది. మంత్రముగ్ధునిలా తండ్రి ఎటు తీసుకుపోతే అటు పోతున్నాడు రాజారావు. రాఘవరావు సరాసరి వాళ్లయింటికి వెళ్ళాడు.

రాఘవరావు, రాజారావులను చూచి అక్కడే యీజీఛేర్‌లో పడుకునున్న సుందర్రావు యెదురుగావచ్చి తీసుకెళ్ళాడు లోపలికి. ఆ క్షణంవరకూ హతాశుడైయున్న రాజారావుకు సుందర్రావుని చూట్టంతోటి పోయినప్రాణాలు లేచివచ్చాయి.

కాఫీ, టిఫిను వగైరాలయ్యాక అందరూ కూర్చుని మాటాడుకోవల్సినవి మాటాడుకున్నారు. వీళ్ళమాటలేమీ పట్టించుకోలేదు రాజారావ్. మళ్ళీ ఏదో దిగులులోపడ్డాడు. తనకోరిక ఫలిస్తుందా? అని అనుకుంటో తలవొంచుకుని కూర్చున్నాడు.

“అమ్మాయిని చూడరా అబ్బాయ్!” అన్నాడు రాఘవరావ్. ఆకేకవిని రాజారావ్ తల పైకెత్తాడు. అతనికి సంభ్రమాశ్చర్యాలొక్కసారిగా కలిగాయి. ఆ క్షణంవరకూ తను హృదయదేవతగా ఆరాధిస్తోన్న విగ్రహమే ఎదురుగా సిగ్గుతో తలవంచుకుని నిలబడుంది. అతని(హృదయం)లో అంతవరకూ మూగవోయిన కోర్కెలు ఒక్కసారిగా మేల్కొని హృదయ విపంచీ తంత్రులను మీటుతూ మధురగానముచేశాయి. శ్యామల ముఖంలోకి చూచి ఆమెకుమాత్రమే అర్ధమయ్యేటట్టు ఓ చిరునవ్వునవ్వివూరుకున్నాడు.

“ఏం? అమ్మాయినచ్చిందా?” అన్నాడు రాఘవరావు.

“ఊఁ!...” అన్నాడు రాజారావు.

ఊ అనక మరేం చెప్తాడు చెప్పండి.